# సైలెన్స్ దీపావళి

యస్. వెంకటేశ్వరరావు

"మల్లికా మల్లికా మంచం మీద పడుకొని సిగరెట్టు కాల్చుకొంటున్న మనోహర్ విసుగ్గా సిగిరెట్టు నుసిని యాష్ట్రేలో విదిలిస్తూ కేకలు పెడుతున్నాడు

పెరడులో అంట్లు తోముతున్న మల్లిక గబగబ చేతులు కడుగుకొని బెడ్‌రూం లోనికి వచ్చి ఏంటండి? అని అడిగింది

ఇంకా అంట్లు తోమడం అవలేదా? ఏమిటి అక్కడ నిద్రపోతున్నావా? మనోహర్ అరుపులకు నెమ్మదిగా అయిపోతుందండి ఐదు నిముషాలలో సంజాయిషీ ఇచ్చుకొంటున్నట్లు చెప్పింది మల్లిక "వేగిరం తగలడు' మనోహర్

నీళ్ళతో తోమిన సామానులు కడుగుతున్న మల్లిక గుండెలు గుబగుబలాడు తున్నాయి ఈ రాత్రి ఏమి జరుగుతుందోనని మల్లిక మనోహర్‌ల వివాహం అయి ఒకటిన్నర సంవత్సరాలు అవుతుంది మల్లిక తండ్రి సత్యంగారు పోస్టు మాస్టరుగా పని చేస్తున్నారు పెళ్ళిలో మగపెళ్ళివారు అడిగినవన్నీ ఎలాగో కష్టపడి ఇవ్వగలిగారు పెళ్ళి అయిన మూడు నెలల వరకు మల్లిక మురిసి పోయింది ఎంత మంచివాడు తనభర్త అని తరువాత సోఫాకు మిక్సర్ కొరకు మనోహర్ బలవంతంపై తండ్రికి ఉత్తరం వ్రాసి వాటిని తెప్పించింది టేప్‌రికార్డరుకు ఉత్తరం వ్రాయమన్నపుడు మాత్రం మా నాన్న కొనలేరండి ఇప్పటికే చాలా అప్పులు చేసారు అని చెప్పింది కాని మనోహర్ రెండు రోజులు వాదించి మూడవ రోజు సిగిరెట్టుతో చురకలు అనే పాత టెక్నిక్కు వాడి మల్లికతో తనే దగ్గరుండి లెటరు వ్రాయించి టేప్‌రికార్డర్ సంపాదించాడు

అంట్లు కడుగుతుందే కాని మల్లిక కళ్ళముందు బి ఏ సెకండ్‌ఇయర్ చదువుతున్న చెల్లెలు రమ ఇంటర్ ఫస్ట్‌ఇయర్ చదువుతున్న తమ్ముడు రవి 7వ తరగతి చదువుతున్న తమ్ముడు చిన్నీ అప్పులు తీర్చడానికి సతమతమవుతున్న అమ్మానాన్నలు మెదులు తున్నారు

ఆ రోజు రాత్రి మనోహర్ ఎలాగయితేనేమి మల్లికచేత సత్యంగారికి దీపావళికి తాము వస్తున్నామని పండగ కట్నంగా టి వి ఏవిదంగానైనా ఇవ్వాలని రాయించాడు

★ ★ ★

రేపు దీపావళి అనగా ఈ రోజు సాయంత్రం కన్నవారింటికి వచ్చింది మల్లిక మనోహర్ వచ్చిన దగ్గరనుండి మొహం కందగడ్డలా పెట్టాడు ఏం బాబు ! ప్రయాణం సుఖంగా జరిగిందా అని అడిగిన అత్తమామలకు ముక్తసరిగా ఆఁ ఆఁ అని సమాధానం చెప్పి లోనికి వెళ్ళి పోయాడు

వచ్చిన రెండు గంటలలోనే మల్లికకు ఇంటి పరిస్థితి అర్థమైంది తనకై చేసిన అప్పులు తీర్చడానికే నాన్న గిజగిజలాడి పోతున్నారని టి వి డబ్బులకు తండ్రి చాలా ప్రయత్నాలు చేశారని ఎక్కడా అప్పు పుట్టలేదని మరీ బావగారు పట్టుబడితే అమ్మ గాజులు అమ్మి డబ్బు ఇద్దామని అమ్మా నాన్నలు అనుకుంటున్నారని చెల్లెలు రమ తామిద్దరమే ఉన్నపుడు చెప్పింది అమ్మ కేకతో వంటలో సాయము చేయుడానికి రమ వంటింట్లోనికి పరిగెత్తింది వంటింట్లో అమ్మ హడావిడిగా అల్లుడిగారికి బోజన ఏర్పాట్లు చేస్తున్నారు సత్యంగారు రవి 5 నిముషాలకు 5 నిముషాలకు వంటింట్లోకి వచ్చి ఇంకా ఏమైనా కావాలా? అని అడుగు తున్నారు టి వి కొనలేదని గ్రహించాడేమో మనోహర్ సాయంత్రం టిపిన్ కూడా ముట్టలేదు అందుకే అందరూ గాబరా పడుతున్నారు

రాత్రి బోజనం కూడా మనోహర్ రుసరుసలాడు తునే ముగించాడు బోజనాల తరువాత సత్యంగారు మనోహర్ ముందు గదిలో మాట్లాడు తున్నారు మనోహర్ పొడిపొడిగా ఒకటి రెండు ముక్కలు మాట్లాడు తున్నాడు సత్యంగారే అల్లుడికి ఏవేవో విషయాలు నోరు నెప్పి పెట్టేటట్లు చెప్తున్నారు

మనోహర్ సత్యంగార్ల బోజనం అయిపోయిన తరువాత మల్లిక రమ రవి బోజనం చేస్తున్నారు చిన్నతమ్ముడు చిన్నీ తండ్రి బావగారికి బాంబులు తారాజువ్వలు కొని తనకు సామానులు చాలా కొద్దిగా కొన్నారని ఏడుస్తూ పడుకొంటే మల్లికే బుజ్జగించి బోజనం చేయించింది బోజనాల దగ్గర సావిత్రమ్మగారే ముందు టి వి విషయం ఎత్తారు

ఏమే మల్లికా, మీ ఆయన టి వి రేపు దీపావళికి కావాలని అంటున్నాడా?

అవునని కాని, కాదని కాని అనకుండా అన్నంలో తనకు మాత్రం ఉంచిన మజ్జిగ కలుపుకుంటోంది సావిత్రమ్మగారే మళ్ళీ క్రిందటిసారి నాన్న తీసిన బట్టలు అల్లుడుకి నచ్చలేదన్నావని ఈసారి బట్టలకు అల్లుడికి 400 రూపాయలు ఇద్దామని నాన్న అన్నారు నీకు నేనే ఒక చీర 200 రూపాయలకు అప్పారావు కొట్లో తీసాను

నాన్న టి వి డబ్బులకు తెలిసినంత వరకు అడిగారు కాని వేలకు వేలు ఎవరిస్తారు నా గాజులు మూడు వేలకు అమ్మి మిగిలింది ఇంటిమీద తెద్దామను కుంటున్నాం అల్లుడు మరీ పట్టుబడితే ఏమి చేస్తాం చెప్పు

ఇంతలో సత్యంగారు వచ్చి, అల్లుడు పడుకుంటానని అంటే పరుపుమీద దుప్పటిపరిచి ఫేన్ పెట్టాను రవీ గ్లాసుతో నీరు పెట్టు తరువాత సత్యంగారు అడిగినప్పుడు కూడా మల్లిక ఏమో నాన్నా నాకు ఏమి తెలీదు అని చెప్పి ఊరుకొన్నది తల్లి దండ్రుల పరిస్థితి చూసిన తరువాత ఆమెకు ఏమి చెప్పాలనిపించలేదు

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

రావలసిన దీపావళి రానే వచ్చింది భిక్కు భిక్కుమనే గుండెలతో ఇంటిల్లిపాదీ తిరుగు తున్నారు రాత్రి సరిగా బోజనం చేయక ఏమో మనోహర్ సుష్టుగా టిఫిన్ తొమ్మిదింటికి తిని, రవి ఫ్రెండ్ ఇంటి నుండి తెచ్చిన నవల మంచంపై పడుకొని చదువు కొంటున్నాడు ఏ భయం లేనిది మల్లిక చిన్నీలకే ఇదే సరియైన సమయమను కొన్నారేమో సత్యంగారు నెమ్మదిగా అల్లుడిని సమీపించి

"మనోహరూ "

పుస్తకంలోంచి తల త్రిప్పి సత్యంగారి వైపు ఒక క్షణం చూసి బద్ధకంగా లుంగీ సర్దుకొని లేచి కూర్చున్నాడు మనోహర్ ఏమిటన్నట్లు మొహం పెట్టి

గది బయట సావిత్రమ్మగారు రవి రమ ఉత్కంఠతో చెవులు రిక్కించి ఉన్నారు మల్లిక కూడా అక్కడే నిలబడి ఉంది

సత్యంగారు బలవంతంగా నవ్వు మొహానికి పులుముకొని మేము క్రితం తీసిన బట్టలు నీకు నచ్చలేదట కదా! అందుకే ఈసారి డబ్బే ఇమ్మని మీ అత్తయ్య చెప్పింది అని చెప్పి జేబులోంచి 400 రూపాయల్ను తీసి మనోహర్ వైపు చేయి జాపారు తీసుకోవలసినదిగా సత్యంగారి గుండె కూడా భితుకు బితుకు మంటున్నది అల్లుడు ఏమంటాడో అని

డబ్బు వైపు నిర్లక్ష్యంగా చూసి, విసుగ్గా గొంతుపెట్టి ఇపుడు బట్ట లెవరికి కావాలి? కావలసినన్ని ఉన్నాయి ఆ ఇచ్చే డబ్బేదో టి వి కి సరిపోయేటట్లు ఇవ్వండి డబ్బు తీసుకోకుండా నిర్మొహమాటంగా చెప్పేశాడు మనోహర్

చాచిన చేతిని నెమ్మదిగా క్రిందికి దించిన సత్యంగారికి ఒక నిముషం ఏమి మాట్లాడాలో తెలియ లేదు తరువాత డబ్బు అనుకొన్న సమయానికి అందలేదు అందిన వెంటనే పంపిస్తాను గది బయటనున్న సావిత్రమ్మగారు భుజం చుట్టూ పైట కప్పుకొని గుమ్మం వద్దకు వచ్చి నచ్చ చెప్పే ధోరణిలో డబ్బు అనుకున్నట్లు అందలేదు బాబూ! అంతకీ కాకపోతే ఇల్లు తాకట్టు పెట్టయినా డబ్బు పంపిస్తాం నా మాట నమ్ము బాబూ! కాదనకుండా ఆ డబ్బు తీసుకో నాయనా! బయస్సురాలైన సావిత్రమ్మగారు చెప్పిన మాటలు విన్న తరువాత

"మీరు ఏమిటి చేస్తారో ఏమో, నా కనవసరం డబ్బు అందినపుడే డబ్బిచ్చి మీ అమ్మాయిని పంపించండి అంతవరకూ ఇక్కడే ఉంటుంది" కర్ర విరిచినట్లు చెప్పి మొహం అసహ్యపడుతున్నట్లు పెట్టి 400 రూపాయలకు చేయి చాపాడు, మనోహర్ ఏమి అంటే ఏమి అవుతుందోనని, సత్యంగారు డబ్బు ఇవ్వడానికి చేయి ఎత్తారు ఇంతలో నాన్నా ! అన్న మల్లిక కేకకు ఆశ్చర్యంగా డబ్బు ఇవ్వబోతున్న సత్యంగారు, తీసుకోబోతున్న మనోహర్ తలలు త్రిప్పి చూశారు మల్లిక నిదానంగా వచ్చి సత్యంగారి చేతిలో 400 రూ లు తీసుకొంది తరువాత మనోహర్ వైపు తిరిగి, టి ఏ కి డబ్బు తీసుకొనేటపుడు మళ్ళీ ఈ 400 రూపాయలు ఎందుకండి?" స్పష్టంగా పలుకుతున్న మల్లికను చూసి ఆశ్చర్యపోతూ మల్లికా! అని సత్యంగారు సావిత్రమ్మలు మందలించే ధోరణిలో

వారి మాటలు వినపడనట్లు మనోహర్ వైపు చూస్తుంది ఆమె ధోరణికి మండిపోతున్న మనోహర్, నువ్వు నోర్ముయ్ అని మాత్రం అనగలిగాడు

మల్లిక నెమ్మదిగానైనా స్పష్టంగా చూడండి రమ పెళ్ళి చేయాలి రవి, చిన్నీల చదువు లున్నాయి నాన్నకి ఇప్పటికే ఊరినిండా అప్పులున్నాయి ఇంకా మనకి టి ఏ లు ఫ్రిజ్‌లు కొనలేరు నాన్న ఊరిలో తలెత్తుకు తిరగలేక పోతున్నారు అప్పులవాళ్ళ వలన"

మనోహర్ మరింత రెచ్చిపోతూ వాళ్ళు ఎలా చస్తే నాకేం? నాకు టి ఏ ఇవ్వకపోతే అయినా నీకు మధ్యన బాదెందుకు" తర్జని వేలెత్తి మాట్లాడుతున్న మనోహర్‌ని చూస్తుంటే మల్లికకు ఒళ్ళంతా కారం పూసుకొన్నట్లయింది ఇక కోపం పట్టలేక–

రాస్కెల్ నాకెందుకా? నీకు ఇవాళ టి ఏ రేపు ఫ్రిజ్ ఇవ్వడానికి ఉన్న ఇల్లు గట్రా అమ్మేసి రోడ్డు పైన ముష్టెత్తుకుంటే నాకు కాకుండా ఇంకెవరికి కావాలి నీలాగ నా సుఖం కోసం ఇంతవరకు నన్ను హింసించిన అమ్మానాన్నలను ముష్టెత్తుకోనీయను

ఏంటన్నావే 'కోపంతో ఊగిపోతూ మల్లికను కొట్టడానికి అన్నట్లు దగ్గరకు వచ్చిన మనోహర్ ఊహించని విదంగా మల్లిక అతని బనియన్



గట్టిగా ఒక చేత్తో పట్టుకుని రెండో చేత్తో ఆ చెంపా ఈ చెంపా ఎడాపెడా కొట్టి ఇంకను ఓర్చుకోలేక రెండు చేతులు గుండెలపై వేసి బలం అంతా ఉపయోగించి వెనక్కి త్రోసింది ఏమి జరుగుతుందో తెలీక నిలబడిపోయిన మనోహర్ ఆ త్రోపుకు మనిషి మొత్తం చెట్టులా వెనక్కి పడిపోయాడు

ధన్

వెనుకనున్న టేబిల్ కొనకు తల వెనుక భాగం విసురుగా తగిలింది తల దిమ్మెత్తిపోయిన మనోహర్ అలా నేలపై చతికిలబడిపోయాడు అంతవరకు సినిమా చూస్తున్నట్లు అచేతనంగా ఉండిపోయిన సత్యంగారు మల్లిక జబ్బ పట్టుకుని "మల్లికా మల్లికా ఏమిటది?" అని గాబరాగా అడుగుతున్నారు

అంతవరకూ బిగపట్టుకుని ఉన్న దుఃఖం ఒకసారి బ్రద్దలై కళ్లనుండి జలజల కన్నీరు రూపంలో కరిగిపోతున్నది మల్లికకు వణికేపెదవులతో –

"చూడు నాన్నా వీడు టేప్‌రికార్డరు టి వి ల కొరకు రాక్షసుడులా సిగిరెట్టుతో కాల్చాడు టి వి లేకుండా ఇంటికి వస్తే తగలబెడతాడట' కోపం బాధ సంస్కారం అనే ముసుగును బ్రద్దలు చేసాయి

అప్పటికే నోట్లో కొంగు పెట్టుకొని ఏడుస్తున్న సావిత్రమ్మగారు బొంగురు పోయిన గొంతుకతో ఏమిటే మల్లికా దీపావళి రోజున ఇది" 'సావిత్రమ్మగారి మాటలు వింటూనే తోక త్రొక్కిన త్రాచులా వెనక్కి తిరిగి–

దీపావళి అంటే ఏమిటమ్మా? నరకాసురుడు చచ్చిన రోజు అసలు నరకాసురుడు అంటే వేలెత్తి మనోహర్ వైపు చూపిస్తూ ఇదిగో డబ్బు కోసం మనలాంటివాళ్ల రక్తం త్రాగే వీడిలాంటి పశువులకు గుర్తు ప్రతి మాటా నొక్కి పలుకుతున్న మల్లిక వైపు రవి రమలు సాదు జంతువులా ఉండే మా అక్కేనా ఇది? అని ఆశ్చర్యంగా చూస్తున్నారు.

'ఒరే ! రేపే నువ్వు సిగిరెట్టుతో తొడలపైనా వీపు పైనా చేసిన పుళ్లు పోలీసుస్టేషన్‌లో చూపెడతా

## నిజమైన దీపావళి

నిన్ను కోర్టుకీడ్చి జైల్లో త్రోయిస్తారా? నీ ఆస్తిలో సగం వాటా సంపాదించకపోతే నా పేరు మల్లికేకాదు నిన్ను నిన్ను మళ్లీ తన్నడానికి అన్నట్లు వెళ్తున్న మల్లికను సత్యంగారు కష్టంమీద ఆపగలిగారు

సావిత్రమ్మగారు పైకే ఏడుస్తూ "ఏమండీ! ఏమిటలా దిష్టి బొమ్మలా అలా చూస్తారు? దీని బ్రతుకిలా ఎందుకు చేశావురా దేవుడా!" దుఃఖం ఉప్పెనలా వస్తుంటే మరి మాట్లాడలేకపోయారు అప్పటికి మల్లిక కొంత సర్దుకొన్నది

"నీకెందుకమ్మా భయం నేను బి ఏ చదువుకున్నాను నా తిండికి, బట్టకు సరిపోయే ఉద్యోగం ఎవరి కాళ్లయినా పట్టుకుని అయినా సంపాదించవచ్చును ఇక పెళ్లంటావా? ఇదిగో ఏదో సుఖపడతానని మీ తలకు మించినదైనా ఈ సంబంధం చేశారు నాకు ఇపుడు పెళ్లి మీద విరక్తి వచ్చింది అయినా తరువాత నా విషయం చూసుకోవచ్చును రమ పెళ్లికి నా జీతం నాన్న జీతం నా నగలు అమ్మగా వచ్చిన డబ్బుతో మంచి మనసున్న మనిషితో జరిగిపోతుంది అలాంటి వాళ్లు ఇంకా ఈ దేశంలో మిగిలి ఉన్నారు "

కోపంగా కొక్కానికి తగిలించి ఉన్న పేంట్ షర్ట్ వేసుకోబోతున్న మనోహర్‌తో మల్లిక ఆ పేంటు షర్టు మా నాన్న ఇచ్చినవి అవి అక్కడపెట్టు ఎవడైనా నీలాగ దుక్కలా ఉన్న ముష్టి వెదవకు ఇచ్చేస్తా

మనోహర్ గ్రుడ్లప్పగించి నేను సిగిరెట్టుతో కాలిస్తే వద్దని చేతులెత్తే మల్లికేనా అని చూస్తున్నాడు

రవీ '"గది బయట ఉండి చూస్తున్న రవి అక్క పిలుపుకు జంకుతూనే వచ్చి ఏమిటన్నట్లు చూస్తున్నాడు నా సూట్‌కేస్ తే మల్లిక చెప్పిన వెంటనే ఒక్క నిముషంలో మల్లిక మనోహర్‌ల బట్టలున్న సూట్‌కేస్ తెచ్చాడు మల్లిక అందులో ఉన్న బట్టలలో తన తండ్రి మనోహర్‌కు తనకు తీసిన బట్టలన్నీ తీసి -ఒక ప్రక్కన పెట్టింది టేబిల్‌పైన ఉన్న ఉంగరం వాచీ మూలగానున్న బూట్లు కూడా తెచ్చి ఆ బట్టల దగ్గర పెట్టి మనోహర్ వైపు చూస్తూ ఇవి మా నాన్న ఇచ్చినవి అదిగో ఆ సూట్‌కేస్‌లో నీ వస్తువులన్నీ ఉన్నాయి ముందు నువ్వు ఇక్కడ నుండి వెళ్లు మరల ఏదో జ్ఞాపకం వచ్చినదానిలా సూట్‌కేస్ తెరచి అందులోనున్న అతని వస్తువులన్నీ తీసి ఈ సూట్‌కేస్ కూడా మా నాన్న ఇచ్చిందే అని చెప్పి వాటిని అతడివైపు కోపంగా విసిరింది యూ గెటవుట్

సాయంత్రం రవి చిన్నీ రమలతో పాటు నవ్వుతూ ఉదయం ఏమీ జరగనట్లు మతాబులు కాలుస్తున్న మల్లికను చూస్తున్న సత్యం సావిత్రమ్మగార్ల హృదయాల నుండి మల్లిక చేసినది సరి అయినదా? కాదా? అనే సందేహం తొలగిపోయింది ఇద్దరూ తృప్తిగా మల్లికా ఇదేనమ్మా నిజమైన దీపావళి అనుకుంటున్నారు □

## మారణ హోమం

పెరుగుతున్న హింసా ప్రవృత్తి
లుప్తమౌతున్న మానవతా దృష్టి
క్షుద్ర రాజకీయ కుటిల తంత్రం
స్వార్థ పూరిత నాయక వర్గం
దేశాన్ని ప్రేతధూమ ధూసరితం చేస్తున్నాయి
వేదభూమిని మరు భూమిగా మారుస్తున్నాయి

పక్షి కోసం తొడ కోసిచ్చిన
శిబిరాజు పుట్టిన దేశంలో
పక్కవాడి మెడ కోయడానికి
వెనుకాడని కిరాతకులు

పరుల కోసం ప్రాణాలిచ్చిన
పుణ్యమూర్తుల నేలలో
ప్రాణాలు తీయడాన్ని కళగా
అభ్యసించే వారు ఉద్భవిస్తున్నారు

పరోపకారమే పరమ ధర్మమని
ఉపదేశించిన సంస్కృతిలో
జీవకారుణ్యమే ఊపిరిగా
జీవించిన ఆర్ష భూమిలో

కక్షలూ కార్పణ్యాలూ
సామూహిక హత్యలూ దౌర్జన్యాలూ
విశృంఖల అరాచకత్వం
హద్దు లెరుగని అమానుషత్వం

కవోష్ణ రుధిరంలో నిత్యం స్నానమాడుతున్న
ఈ దేశం
చితాగ్నితో శరీరాన్ని ఆర్పుకుంటోంది
రావణ కాష్టంలా రాజుకునే ప్రేత ధూమాన్ని
సాంబ్రాణి పొగగా వాడుకుంటోంది

-క్రొవ్విడి సూర్యనాగ శమంతకమణి

